క్లుప్తంగా

సహకార సంఘం బలోపేతానికి కృషి చేయాలి



ఎమ్మెల్యే వేముల వీరేశానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు

చిట్యాల: సహకార సంఘం బలోపేతానికి సహకరించాలని చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామ పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని కోరారు. శుక్రవారం పాలకవర్గ సభ్యులు ఆయనను కలిసి శాలువతో సన్మానించారు. వారిలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, మాజీ చైర్మన్ పిశాటి భీష్మారెడ్డి, డైరెక్టర్లు గడ్డం సత్తిరెడ్డి, ఏదుళ్ల అజిత్‌రెడ్డి, టీకుల కవితా అంజిరెడ్డి, ఏనుగు రఘుమారెడ్డి తదితరులున్నారు.

20న దేశవ్యాప్త సమ్మె



నిరసన తెలుపుతున్న మెడికల్ రిప్రెసెంటేటివ్‌లు

నల్లగొండ టౌన్: మెడికల్ అండ్ సేల్స్ రిప్రెసెంటేటివ్స్ డిమాండ్ల సాధనకు ఈ నెల 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మెడికల్ అండ్ సేల్స్ రిప్రెసెంటేటివ్ యూనియన్ జిల్లా బ్రాంచ్ కార్యదర్శి రావుల రవికుమార్ కోరారు. శుక్రవారం సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నల్లగొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సోమా, స్వామి, నిరంజన్, రమేష్, మహేష్, జీవన్, రాంబాబు, ముకేష్, శ్రీను, శ్రవన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలివ్వాలి

నల్లగొండ టూటౌన్: ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన ఎరుకల కులస్తులకు సబ్సిడీ రుణాలు ఇచ్చి ఉపాధి కల్పించాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల అంజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయంలో ఎరుకల కులస్తులకు అన్యాయం జరిగిందని, ఎరుకల బంధు పెట్టకుండా తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎరుకల కులస్తులకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

17న సీపీఐ మండల కౌన్సిల్ సమావేశం

చిట్యాల: చిట్యాల మండల సీపీఐ కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి ఎండీ అక్బర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ మండల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడి పూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి (నల్లగొండ): పట్టణంలోని రవీంద్రనగర్‌లో శుక్రవారం రామ్‌పాటి శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గార్లపాటి భారతమ్మ మురళి, రామేశ్వరి, నగేష్, పావనిరమ్య, సుధాకర్, సాయి, సముద్రాల వినోద్, లక్ష్మీ ప్రవీణ్, పరమేశ్వరి, మదన్‌గుప్త, కాసం శేఖర్, పృథ్వీధర్‌రెడ్డి, దాసరి కిరణ్, వేములహరి, విజయ్, భరత్ పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

చిట్యాల, కేతేపల్లి: నూతనంగా భూమి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు 2023–24 యాసంగి సీజన్‌కుగాను రైతు బంధు పథకానికి దరఖాస్తు చేసుకోవాలని చిట్యాల మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు, కేతేపల్లి మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. కొత్తగా కొన్న భూమి పట్టాదారు పాస్ పుస్తకంతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌లను వ్యవసాయ విస్తరణ కార్యాలయాల్లో అందజేయాలని తెలిపారు.

20న మండల సమావేశం

కేతేపల్లి: కేతేపల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 20న ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హరికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

యథేచ్ఛగా ఇసుక రవాణా

- అమ్మనబోలు మూసీ వాగు నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తరలింపు
- పట్టించుకోని పోలీసు అధికారులు



నార్కట్‌పల్లి పట్టణానికి ట్రాక్టర్ ద్వారా సరఫరా చేస్తున్న ఇసుక

నార్కట్‌పల్లి: మండలంలోని అమ్మనబోలు మూసీ వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా సాగిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇసుకకు డిమాండ్ ఉండడంతో మూసీ వాగుపై రాజకీయ నాయకుల కన్ను పడింది. ఓ వైపు ప్రభుత్వం ఇసుక తరలింపుపై ఆంక్షలు విధిస్తున్నా గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అమ్మనబోలు మూసీ వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా నేరుగా నార్కట్‌పల్లికి తీసుకువచ్చి ట్రాక్టర్‌కు రూ.3,800 నుంచి రూ.4,500 వరకు విక్రయిస్తున్నారు.

సమీప గ్రామాల్లో డంపింగ్ చేసి..

మూసీ వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా తీసుకువచ్చిన ఇసుకను సమీప గ్రామాల్లోని అజ్ఞాత ప్రదేశాల్లో నిల్వ చేస్తున్నారు. వీలున్నప్పుడల్లా రాత్రి సమయంలో లారీల్లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారని సమాచారం. ఇదిలా ఉంటే ఇసుక తరలిపు వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీల నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా రాజకీయ ప్రముఖుల ఒత్తిళ్లతో పోలీస్, రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అమ్మనబోలు నుంచి వచ్చే ట్రాక్టర్లు, లారీలపై కేసులు నమోదు చేయకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే లారీలపై కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అమ్మనబోలు వాగు నుంచి నార్కట్‌పల్లికి రోజుకు దాదాపు 10 నుంచి 20 ట్రాక్టర్లు, అదేవిధంగా 5 నుంచి 10 లారీలు అర్ధ రాత్రి సమయంలో హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.

ప్రతి ట్రాక్టర్ నుంచి నెలకు రూ.10 వేలు వసూలు

ఇసుక అక్రమ రవాణా చేసేందుకుగాను అమ్మనబోలు గ్రామంలో సుమారు 50 ట్రాక్టర్లు ఉన్నాయి. వీరంతా ఒక సంఘం ఏర్పాటు చేసుకుని వివిధ గ్రామాలకు ఇసుక సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. అయితే గ్రామ పంచాయతీకి ప్రతి ట్రాక్టర్ ప్రతి నెలా రూ.10 వేల చొప్పున గత కొన్ని నెలల నుంచి ఇస్తున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులకు ప్రతినెలా మామూళ్లు ఇస్తుండడంతో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునే వారు లేకుండా పోయారని గ్రామస్తుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

తనిఖీలు చేస్తున్నాం

ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారని పలువురు సమాచారం అందించారు. ఈమేరకు తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా సాగిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– సైదాబాబు, ఎస్సై

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: విద్యార్థులు చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని ఎంవీఆర్ కాన్సెప్ట్ స్కూల్‌లో నిర్వహించిన ఇన్‌స్టాలేషన్ ఆఫ్ స్కూల్ కేబినేట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ తాను చదువుకునే సమయంలో విద్యార్థి నాయకుడిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు నేటి విద్యా విధానంలో వారి పిల్లల ర్యాంకుల కోసం పరుగులు పెడుతున్నారని, అలా కాకుండా నిత్య జీవితానికి అవసరమైన విద్య నేర్చుకునేలా సూచనలు చేయాలన్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం పాఠశాలలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌చంద్‌రెడ్డి, విద్యా సంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్, ఎంవీఆర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ గీతా రవికుమార్, ప్రిన్సిపాల్ మేరెడ్డి రఘునందన్‌రెడ్డి, ఐఐటీ డీన్ అహ్మద్ అలీ, మల్లారెడ్డి, శ్రవణ్‌కుమార్, డీఎస్‌ఆర్, సాయికృష్ణ, హేమాదేవి, లక్ష్మీనాథ్, విశ్వేశ్వర్‌రావు, భరత్, వర్ధిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని వివిధ కాలనీల్లో ఉన్న పార్కులు, ప్రభుత్వ విద్యాసంస్థల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక, రాంనగర్‌లోని వైఎస్సార్ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలేజీ ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రత పాటించాలని కళాశాల సిబ్బందికి సూచించారు. పార్కులో పిల్లలకు కావాల్సిన వివిధ రకాల ఆట వస్తువులను అమర్చుతామని తెలిపారు. ఆయన వెంట అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుర్వి శంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

మర్రిగూడ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మిర్యాల పద్మ అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండలంలోని కొట్టాల గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరభ్యాసం నిర్వహించారు. చేతుల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సౌజన్య, మంగమ్మ, రజిత తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



లింగారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మునుగోడు: బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన సీపీఐ సీనియర్ నాయకుడు గట్టుపల్లి లింగారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని జాతీయ కార్యవర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని కల్వలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, సీపీఐ జిల్లా నాయకుడు గట్టుపల్లి నర్సిరెడ్డి తండ్రి లింగారెడ్డి గత గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులను శుక్రవారం పల్లా వెంకట్ రెడ్డితో పాటు జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, రాష్ట్ర నాయకుడు ఉజ్జిని రత్నాకర్ రావు పరామర్శించారు.

ఓటును మా గ్రామంలోకి మార్చాలి

మునుగోడు: తమ గ్రామానికి చెందిన దాదాపు 100 మంది ఓటు హక్కు మునుగోడులోని పలు బూత్‌లలో ఉన్నాయని, వాటిని తమ సొంత గ్రామమైన గుండ్లోరిగూడేనికి మార్చాలని గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జంగిలి నాగరాజు కోరారు. ఈమేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. గుండ్లోరిగూడెంలో మొత్తం ఓటర్లు 402 మంది ఉండగా గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ నంబర్ 165లో కేవలం 295 మందికి మాత్రమే ఓటువేసే అవకాశం ఉందని, మిగిలిన 104 మంది ఓటు మునుగోడులోని 163, 164, 157, 159 బూత్‌లల్లో ఉన్నాయని తెలిపారు. ఓటర్లు మునుగోడుకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి వస్తుందని, వీరిని తమ బూత్‌లోకి మార్చాలని కోరారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాగరాజు

'చలో ఢిల్లీ' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: ఎస్సీ వర్గీకరణ సాధనకు ఈ నెల 21న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మారపాక నరేందర్‌మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం నల్లగొండలో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగల చిరకాల స్వప్నమైన ఎస్సీ వర్గీకరణ విషయంలో ప్రధాని మోదీ ప్రభుత్వం కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణపై స్పష్టతను ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత

చండూరు: కోదాడ పట్టణంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో చండూరులోని సన్‌షైన్ పాఠశాల విద్యార్థులు బి.చైతన్య, బోయపల్లి లలిత్ కుమార్ పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులను, శిక్షకులు నాని, అన్వేక్, ప్రవీణ్‌లను శుక్రవారం స్థానికంగా పాఠశాల కరస్పాండెంట్ కోడి వెంకన్న అభినందించారు. రైఫిల్ షూటింగ్ శిక్షణతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని ఆయన తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న కోడి వెంకన్న

అలరించిన సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న క్రైస్తవ సంఘం పెద్దలు



గీతాలు ఆలపిస్తున్న క్రైస్తవ మహిళలు

రామగిరి(నల్లగొండ): సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం బ్రాంచ్ చర్చీస్ పాస్టర్స్ కాన్వెన్షన్ సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ బాప్టిస్టు కాన్వెన్షన్ జనరల్ సెక్రటరీ బ్రదర్ సన్నీ ఫ్రాన్సిస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీనియర్ పాస్టర్ రెవరెండ్ డా.ఎస్. కాలేబు క్రీస్తు సందేశం వినిపించారు. అనంతరం గ్రామీణ పాస్టర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీస్తు జననం నాటకం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు డా.టీఎస్ క్రిస్టఫర్, ఫాస్టర్ డా. సతీష్‌చంద్రదాస్, వైస్ ప్రెసిడెంట్ మాణిక్యం, కార్యదర్శి అబ్సలూమ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆనంద్‌ప్రసాద్, కోశాధికారి కృపానందం, మహిళా అధ్యక్షురాలు సర్వోదయామణి, రామారావు, ప్రాజెక్టు చైర్మన్ టీఎస్ విలియమ్స్, సభ్యులు కళమ్మ, ఆశయ్య, దాసు, మత్స్యగిరి, లక్కి స్టాలిన్, ప్రేమ్‌కుమార్, ఫ్రాన్సిస్, చిత్తరంజన్‌దాసు పాల్గొన్నారు.

చెక్‌డ్యాంలు లేక వాగునీరు వృథా

- మూసీలో కలుస్తున్న చిన్నపాలేరు వాగు నీరు
- చెక్‌డ్యాంలు నిర్మిస్తే పెరగనున్న భూగర్భజలాలు



గత వానాకాలంలో తాటికల్ వద్ద పారుతున్న వాగు (ఫైల్)

నకిరేకల్: నకిరేకల్ మండలం తాటికల్, చందుపట్ల, మండలాపురం మీదుగా పారుతున్న చిన్న పాలేరు వాగుపై చెక్ డ్యామ్‌లు లేకపోవడంతో భారీ వర్షాలు కురిసినప్పుడు నీరు వృథాగా వేములపల్లి మండలం మూసీ నదిలో కలుస్తుంది. నార్కట్‌పల్లి, కట్టంగూర్, నకిరేకల్, వేములపల్లి మండలాల మీదుగా ఆసిఫ్‌నగర్, రాచకాల్వ, ఏఎమ్మార్పీ కాల్వల వృథా నీటితో చిన్నపాలేరు వాగు పారుతుంది. దాదాపు 60 కిలోమీటర్ల పొడవు ఈ వాగు ప్రవహిస్తుంటుంది. ఈ వాగుపై ఎక్కడికక్కడ చెక్‌డ్యాంలు నిర్మిస్తే వాగు పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని, కానీ ఈ విషయంపై ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో ఎంతో ప్రయోజనం

చిన్న పాలేరు వాగుపై చెక్ డ్యామ్‌లు నిర్మిస్తే ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో మేలు చేకూరనుంది. నకిరేకల్ మండల పరిధిలో తాటికల్ గ్రామం వద్ద పూర్వ కాలంలో ఒక ఆనకట్ట నిర్మించడం వల్ల చందుపట్ల, మంగళపల్లి, మర్రూర్ తదితర గ్రామాలకు ప్రత్యేక కాల్వ ద్వారా చెరువులకు నీరు అందుతుంది. ప్రస్తుతం ఈ పాలేరు వాగు ద్వారా తాటికల్ వద్ద నిర్మించిన ఆనకట్ట వద్ద నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామంలోని రా సముద్రం చెరువు (పెద్ద చెరువు) కూడా నిండుతోంది. రెండేళ్ల క్రితం మంగళపల్లి శివారులో ఒక చెక్ డ్యాం నిర్మించారు. ఇంకా ఈ వాగుపై 15 వరకు చెక్ డ్యామ్‌లు నిర్మిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందని ఆయా ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

మరో మూడు చెక్ డ్యామ్‌లు నిర్మించాలి



నకిరేకల్ మండలం మీదుగా పారుతున్న చిన్న పాలేరు వాగుపై అక్కడక్కడా చెక్ డ్యామ్‌లు నిర్మిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుంది. తాటికల్, చందుపట్ల గ్రామాల మధ్యలో మరో మూడు చెక్ డ్యామ్‌లు నిర్మిస్తే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఇమడపాక లక్ష్మి, ఎంపీటీసీ చందుపట్ల

పీఆర్ రోడ్డును ఆర్‌అండ్‌బీగా మార్చాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శాలిగౌరారం: శాలిగౌరారం మండల కేంద్రం నుంచి వయా భైరవునిబండ మీదుగా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు వరకు ప్రస్తుతం ఉన్న 17 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్డును ఆర్‌అండ్‌బీ రోడ్డుగా మార్చాలని సర్పంచ్ దండ రేణుకఅశోక్ రెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డుతో తిరుమలరాయునిగూడెం, జాలోనిగూడెం, వద్దిపాముల, భైరవునిబండ గ్రామాలకు ఎంతో ప్రయోజనం కలుగనుందని తెలిపారు. అదేవిధంగా భైరవునిబండ గ్రామం నుంచి నక్కలపల్లి వరకు ఉన్న లింక్‌రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మర్రిగూడ విద్యార్థినులకు బంగారు, వెండి పతకాలు



పతకాలు చూపుతున్న వేద, సింధు

మర్రిగూడ: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలో బంగారు, వెండి పతకాలు సాధించారు. ఇటీవల విశాఖపట్టణంలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఖేలో ఇండియా పోటీల్లో మండల కేంద్రానికి చెందిన పంతంగి లక్ష్మీపతి కుమార్తె వేద బంగారు పతకం, కట్కూరు వెంకటేష్‌గౌడ్ కుమార్తె సింధు వెండి పతకం సాధించగా శుక్రవారం వారికి పతకాలు అందచేశారు. బంగారు, వెండి పతకాలు సాధించడం పట్ల వారిని అభినందించారు.

నిలిచిన పాఠశాల మరమ్మతులు



మరమ్మతులు చేయని హైస్కూల్ భవనం

- మర్రిగూడ హైస్కూల్‌లో పూర్తికాని 'మన బడి' పనులు
- నిధులు విడుదల కాకపోవడంతో నిలిచిన మరమ్మతులు

మర్రిగూడ: మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా మర్రిగూడ హైస్కూల్‌కు నిధులు మంజూరయ్యాయి. సంబంధిత కాంట్రాక్టర్ వేసవి సెలవుల్లో హైస్కూల్‌లోని ఆరు తరగతి గదులు, ప్రధానోపాధ్యాయుడి గది ఎదుట ఉన్న రేకులను వేసవి సెలవుల్లో తొలగించారు. సంబంధిత కాంట్రాక్టర్ స్వల్ప పనులు ప్రారంభించినప్పటికీ పూర్తిస్థాయిలో రేకులను ఏర్పాటు చేయలేదు. దీంతో తరగతి గదుల కొరత ఏర్పడింది. ఉన్న గదులకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

పనులు నిలిపివేశారు

ప్రభుత్వం మన ఊరు – మన బడి కార్యక్రమంలో నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. గదులు సరిపడా లేక పాఠశాల నిర్వహణ కష్టంగా మారింది. విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి.

– నీరుడు అంజయ్య, హెచ్‌ఎం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

నాంపల్లి: మండలంలోని నేరళ్లపల్లి గ్రామానికి చెందిన ఆక నర్సింహ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ గఫర్ చేతుల మీదుగా రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొన్‌రెడ్డి రామస్వామి, రమేష్, రాములు, పర్వతాలు, రాజు, పెద్దిరాజు, క్షత్రీయ, హుసేన్, శివ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న గఫర్

వల్లభాయ్ పటేల్‌కు నివాళి

శాలిగౌరారం: మండల కేంద్రంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్‌రోడ్డులో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చామల వెంకటరమణారెడ్డి, ఆకుల శ్రీను, సిరుపంగి రాములు, బుడిగె శ్రీనివాసులు, బచ్చు ఆంజనేయులు, శ్రీనివాసులు, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు పెన్షనర్ల ఆవిర్భావ దినోత్సవం

నకిరేకల్: నకిరేకల్‌లో మూసీ రోడ్డులో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆదివారం పెన్షనర్స్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పసల మరియదాస్, కార్యదర్శి కందుల సోమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 70 ఏళ్లు పూర్తి చేసుకున్న పెన్షనర్స్‌ను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. పెన్షనర్లు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి తుమ్మలను కలిసిన టీఎన్‌జీఓ నేతలు

నల్లగొండ టౌన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తుమ్మల నాగేశ్వర్‌రావును శుక్రవారం సచివాలయంలోని ఆయన చాంబర్‌లో జిల్లా టీఎన్‌జీఓ నాయకులు కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవన్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేపూరి నర్సింహాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగిళ్ల మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు డీఐ రాజు తదితరులు ఉన్నారు.

చిన్నారులకు పలకల పంపిణీ



చిన్నారులకు పలకలు అందజేస్తున్న శివలీల, బండమీది అంజయ్య

కనగల్: మండల పరిధిలోని బచ్చన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో సామాజిక సేవా కార్యకర్త, ఆర్‌ఎంపీ వైద్యురాలు కంబాల శివలీల ఆధ్వర్యంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు పండ్లు, పలకలు అందజేశారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు సంరక్షణ సమితి అధ్యక్షుడు బండమీది అంజయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ వైద్యులు దాసోజు కృష్ణమాచారి, భిక్షాల మహేష్, అంగన్‌వాడీ టీచర్ భారతి, లక్ష్మమ్మ, లింగమ్మ, రాములమ్మ తదితరులున్నారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు



రోడ్డు ఇరుకుగా ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

మర్రిగూడ: మండల కేంద్రంలోని మర్రిగూడ నూతన బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ఇరుకు రోడ్డుతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.